## వడపోసిన సత్యం

నేను ఖర్గపురంలో మా చిన్నాన్నగారింటికి రావడం అదే మొదటిసారి మాపినతండ్రి నన్నొరోజు పిలిచి యిలా చెప్పేడు. "ఒరేయి అబ్బాయ్, నువ్వు మట్టుకు పీకపోయినా ఓ పూతికెత్తు సహాయం చెయ్యకు. ఈ వెధవ ఊర్లో చూస్తుంటే బుట్టలో వేసేస్తారు దొంగ ముండాకొడుకులు, ఇదిమాత్రం మరిచిపోకు" సహాయంచేస్తే వచ్చే నష్టమేమిటని అనుకుంటుండేవాడిని. 'సరేలే జాగ్రత్తగానే ఉంటాన'ని చెప్పేను మా పినతండ్రితోటి.

ఒకరోజు మా చిన్నాన్న ఆఫీసుపని మీద తొందరగా వెళిపోతూ, నాచేతికి 5 విడి రూ॥లు ఇచ్చి, ఇంట్లో పిన్ని చెప్పిన సామాన్లు తెమ్మనమన్నాడు. మరి పిన్ని చెప్పినవన్నీ రాసుకొని బజారుకి వెళ్ళికొన్నాను. ఎంత అయిందని అడిగాను కొట్టువాడిని. మూడున్నర అయిందండీ అన్నాడు కొట్టువాడు. సరేనని నాలుగు రూ పా యి లు ఇవ్వబోతుంటే, ఎక్కడినుంచి వచ్చేడో ఓ హిందీ పిల్లాడు, "బాబూ రెండు విడి రూ పా య లిప్పించండి" అన్నాడు. కొట్టువాడికిచ్చేబదులు, పి ల్లా డి కి స్తే నష్టమేమిటని రెండు రూపాయల కాగితం పుచ్చుకొని, రెండు వి డి రూ పాయిలు ఇచ్చేను. కొట్టువాడికి పిల్లాడిచ్చిన నోటు, విడి రూపాయలూ ఇచ్చేను. కొట్టువాడు రెండురూపాయల నోటు తిరిగి ఇచ్చేస్తూ, "బాబూ మరి లాంటి గ మ్మ త్తు లు చెయ్యకండి. యిందండి ఈరెండు రూపాయలనోటు తీసికొని మ రొ క టి యిప్పించండి" అన్నాడు. నాకు వళ్ళుమండిపోయింది. "నీకేం కళ్ళున్నాయా లేవా ? రెండు రూపాయలనోటు కొత్తగావుంటే మరోటి యిమ్మంటావేమిటి. నన్నా టోపీవేద్దామని చూస్తున్నావు జాగ్రత్త" అన్నాను దబాయిస్తూ. వెధవఉన్నవాడల్లా ఒక్కమాటు ఎగిరి అరిచేడు, "వెళ్ళవయ్యా మాగొప్పబేరం చెయ్యవచ్చేవు. టోపీ వేద్దామనుకుంటున్నది నువ్వా నేనా, నోటు తిరగేసి చూడవయ్యా నీకే తెలుస్తుంది" అన్నాడు కొట్టువాడు. తిరగేసి చూద్దును నిలువునా నీరయి మారిపోయేను. నోటుమీద రాజుగారి బొమ్మ క్రింద "పాకిస్థాన్" అన్న నల్లటి అక్షరాలు కనిపించేయి దెయ్యంలాగ. అప్పుడనుకున్నాను. మా పినతండ్రి 'కాచి వడపోసిన సత్యం' చెప్పేడని.

ఘుండికోట అప్పల నరసింహం.

* * *

## గొప్పకోరకు పోతే...?

దూరమునుంచీ 'రెడ్డీ!' అన్న పిలుపు వినబడ్డాది. వెంటనే ఆపిలుపు చిరపరిచితులైన బుర్రామేస్టారేయని గ్రహించి, హంసగమనముతో పోయి అయన ముందు నిలబడ్డాను. వెన్నెలను వెక్కిరించే వో చిరునవ్వువిసరి, "అబ్బే మరేమీ లేదురా! నీలో మంచి నేర్పు చాకచక్యము, తెలివితేటలూ వున్నాయి. నీలాగ ఆ వేయికన్నులుకల ఇంద్రుడు కూడా కూ ర గా య లు యెంచలేడు. ఇంతకీ నువ్వీరోజు మంచి మువ్వొంకాయలు తేవాలి. నిజంగా యేమి బుద్ధి కుశలత యిచ్చాడురా నీకు దేముడు ! అంటున్న యిటువంటి స్తుతిదండకాలు పొందిన యేమనిషి అందులో యేపురుషుడు; సంతోషించడు చెప్పండీ? ఒక మారు సగర్వంగా అద్దంలో ముఖం చూచుకొన్నాను. "నిజమేనని" నాకే అనిపించింది. ఇక వొరులమాట వేరే చెప్పనేల? "బేసుగ్గా తెస్తా" నంటూ ఆయన యిచ్చిన బేడడబ్బులూ పుచ్చుకొని; బజారు వెళ్లాను. బజారులో వంకాయలున్నాయి. అర్ధణాకొక కాయ కన్న యెక్కువ యీయమంటున్నారు. "సరే" అని మన తెలివితేట లుపయోగించాము; జేబులోనుంచి మరో బేడ వేసి, 'డిగ్నిటీ'కి లోపంరాకుండా యెనిమిది వం కా య లు కొని ; మేస్టారికిచ్చాను. మేస్టారు "అ హ హ ! ఏం వంకాయలూ! ఎంతచవుకగావున్నాయి! నీకే చెల్లిందిరా బేరంచేయుటలో !" అని అంటూవుంటే నా వొళ్ళు పాలు పొంగినట్లు పొం గి పో యి, క్రమంగా మానవ ప్రపంచాన్నే మ రి చే స్థి తి వచ్చింది. కాని "ఒరే ! బాబూ ! మరో పావలా వంకాయలు యిట్టివే పట్టుకు రారా!" అని పావలా చేతిలోపెట్టేసరికి, తిరిగి యీ ప్రపంచములో పడ్డాను. దాంతో కొంత కంగారుకూడా పడ్డాను. "ఆపదయందు ధైర్యగుణ"మన్న సుభాషితము గిర్రున బుర్రలో తిరిగింది. పదేపదే "తమకార్యంబు పరిత్యజించి పరహితార్థప్రాపకుల్ సజ్జనుల్" అన్న పద్యము పఠిస్తూ, మన తెలివితేటలకు నష్టపరిహారముగా మరో పావలాకలిపి, పదహారు వంకాయలు కొని యింటికి వచ్చాను. "కనుక అనవసరపు గొప్పలకుపోయి వున్న డబ్బు వొదుల్చుకొనే కంటే, యింటిదగ్గరేవుండి, ఇహానికీ పరానికీ పనికివచ్చే, "సుందరాకాండ పు రా ణ పఠన లెస్సగా నుండనోపునేమో!" అన్న అనుమానము; గోడకు కొట్టిన మేకులాగ గట్టిగా నా బుర్రలో నాటుకుపోయింది.

ఫణిహారం వెంకటరెడ్డాచార్యులు,

## * భావతరంగాలు *

రచన: మానేపల్లి వెంకటరాజు

●

హృదయవీణియపైన
మధురతంత్రులుమీటి
కలకంఠగానముతో
కలిపిపాడుదునా !

నీలాలనింగిలో
నిగిడి విలాసినై
తెలిమబ్బుతెరలపై
తేలియాడుదునా !

విరిసేగులాబీల
అరుణరేకులయందు
చిరునవ్వుశోభతో
కరిగిపోవుదునా !

ప్రేమసామ్రాజ్యాన
ప్రియునిహృత్ పీఠిపై
మహారాణినై నేను
మహినిపాలింతునా !

సెలయేటి కెరటాల
చలువడోలికలపై
ఊగేటిమనసుతో
సాగిపోవుదునా !

విశ్వసౌధంబులో
విశ్వనాధుండైన
విశ్వేశ్వరునిలో
విలీనంబొందునా !